క్లుప్తంగా

జేవీవీ వార్షిక మహాసభలు 16న

నెల్లూరు(అర్బన్) : జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) నెల్లూరు నగర 17వ వార్షిక మహాసభలు ఈనెల 16వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నామని ఆ వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని హరనాథపురంలో ఉన్న డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం జరుగుతాయన్నారు. ఈ సభలో శాస్త్రీయ విజ్ఞానం, సైంటిఫిక్ టెంపర్ అనే అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మద్యం మత్తులో ఫిట్స్

• వ్యక్తి మృతి



సుభాని మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : మద్యం మత్తులో ఫిట్స్ రావడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం జనార్దనరెడ్డికాలనీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. జనార్దనరెడ్డికాలనీకి చెందిన సుభాని(31), సాబ్‌జాని దంపతులు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. వెంకటేశ్వరపురంలోని టీ దుకాణంలో సుభాని టీ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా ఆయన ఫిట్స్‌తో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం తనకు తెలిసిన వారి ఇంట్లో ఫంక్షన్ ఉందని విధులకు సెలవు పెట్టారు. అప్పటి నుంచి మద్యం సేవించసాగాడు. సోమవారం పూటుగా మద్యం సేవించి ఇంటికి వెళ్తుండగా జనార్దనరెడ్డికాలనీ కల్వర్ట్ వద్దకు వచ్చేసరికి ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మృతుని భార్య, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మృతుని భార్య సాబ్‌జాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తెలిపారు.

ఘనంగా ఎస్టీఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



నెల్లూరు (టౌన్) : స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మాగుంట లేఅవుట్‌లోని వారి కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో సంఘ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, పూర్వరాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, జిల్లా కార్యదర్శులు నాగిరెడ్డి, ఖాజావలి, సురేంద్రబాబు పాల్గొన్నారు.

వెలిగిన వీధి దీపాలు



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బృందావనం) : కొత్తూరు న్యూ జర్నలిస్ట్ కాలనీలోని మెయిన్‌రోడ్డులో ఉన్న వీధిదీపాలు సోమవారం వెలిగింది. గత నెలరోజులకు పైగా వీధిదీపం వెలగడం లేదంటూ సాక్షిలో సోమవారం ప్రచురితమైన 'అలంకార ప్రాయంగా వీధి దీపాలు'' కథనానికి నగర పాలక సంస్థ డీఈ సుధేష్ణ స్పందించారు. లైన్‌మెన్ నరసయ్య, సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించి వెలిగేలా చేశారు.

ఎన్వీ రమణయ్యకు పురస్కారం



నెల్లూరు(బృందావనం) : నగరానికి చెందిన సీనియర్ నాట్యాచార్యుడు నాగిశెట్టి వెంకట రమణయ్యను 'రాయలసీమ రంగస్థలి కళా సంస్థ' నాట్యకౌముది పురస్కారంతో సన్మానించింది. దీనిపై ఆయన సోమవారం మాట్లాడారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి శ్రీకృష్ణదేవరాయ కళోత్సవాల కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారులను పురస్కారాలతో సత్కరించి అభినందించారన్నారు. ఈ క్రమంలో 30 ఏళ్లుగా న్యాయనిర్ణేతగా వ్యవహరించిన తనను 'నాట్యకౌముది' పురస్కారంతో సన్మానించి ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందజేశారన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

• కమిషనర్ సూర్యతేజ



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగర పరిధిలో స్థానిక సమస్యల సత్వర పరిష్కారానికి వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ నగరంలో వార్డు సచివాలయాల వారీగా కార్యదర్శులు తమ పరిధిలో ప్రజల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎన్ఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, వాటిని స్థానికంగానే పరిష్కరించాలని తెలిపారు. ప్రజల నుంచి అందే అర్జీలను ఫైనాన్స్, నాన్ ఫైనాన్స్ అంశాలను నిర్దేశిత కాలపరిమితితో పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రతి సోమవారం అందే ఫిర్యాదుల పరిష్కారానికి నివేదికను తదుపరి వారం జరిగే సమావేశంలో అందించాలని ఆదేశించారు.

ప్రజల నుంచి 21 ఫిర్యాదులు

సోమవారం ప్రజల నుంచి 21 ఫిర్యాదులు అందాయని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి -6, పబ్లిక్ హెల్త్ విభాగానికి-1, టౌన్‌ప్లానింగ్ విభాగానికి-6, హౌసింగ్ విభాగానికి-8 చొప్పున ఉన్నాయని చెప్పారు. ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య, సిటీప్లానర్ దేవీకుమారి, మేనేజర్ ఇనాయతుల్లాతో పాటు పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జలాశయాల్లో నిర్వహణ చేపట్టాలి



వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు(దర్గామిట్ట) : రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో నిర్వహణ విస్మరించడంతో అవి ప్రమాదకరస్థితిలో ఉన్నాయని, వాటిల్లో వెంటనే నిర్వహణ పనులు చేపట్టాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు తెలుగు గంగ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎస్‌టీపీ నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహణ లేకపోవడం వల్లనే తుంగభద్ర గేటు కొట్టుకుపోయిందని తెలిపారు. జిల్లాలోని కండలేరు, సోమశిల జలాశయాల్లో లాక్‌గేట్లకు నియంత్రణ లేవన్నారు. సోమశిల డ్యామ్ డౌన్‌స్ట్రీమ్‌లో దెబ్బతిన్న ఆప్రాన్, డ్యామ్ గేట్ల నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కండలేరు డ్యామ్ గేట్లు మొరాయించి ఉన్నాయని, మట్టికట్టపై విచ్చలవిడిగా చెట్లు పెరిగి ప్రమాదకరస్థితికి చేరుకున్నాయన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

ఆలయ కమిటీ ఏర్పాటు చట్ట వ్యతిరేకం



మాట్లాడుతున్న తన్నీరు వెంకటసుబ్బారావు

నెల్లూరు(బారకాసు) : కన్యకాపరమేశ్వరి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు చట్ట వ్యతిరేకమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆలయ జీవితకాల సభ్యుడు తన్నీరు వెంకటసుబ్బారావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత నెల 31వ తేదీన ఏర్పాటైన కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ చట్ట విరుద్ధమైనదని వివరించారు. దీన స్థితిలో ఉన్న ఆలయాన్ని గత చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది సభ్యులందరి సహకారంతో సక్రమంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆయన్ను పోలీసు సహకారంతో అరెస్ట్ చేసి అర్హత లేని ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీని ఏర్పాటు చేయడం చట్ట వ్యతిరేకమన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ ఆర్యవైశ్యుల ప్రమేయం లేకుండా జరిగిన కమిటీ నియామకంపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

నెల్లూరు (టౌన్) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బుజబుజనెల్లూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, దేశభక్తి గేయాల పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నిర్వాహకులు భారతి, అరుణ, ఎస్‌కే నజ్మా మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 14న బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయుడు అచ్యుతమణి తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను ఆపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

నెల్లూరు(బృందావనం) : బంగ్లాదేశ్‌లో అమాయక హిందువులపై కొనసాగుతున్న మారణకాండ, దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నగరంలో సోమవారం హిందువులు ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. స్థానిక వీఆర్సీ కూడలి నుంచి ట్రంకురోడ్డులో ఉన్న శివాజీ విగ్రహం వరకు హిందువులు ప్రదర్శన చేపట్టారు. బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభానికి సంబంధం లేని హిందువులపై అరాచకమూకలు దాడులు చేయడం, అత్యాచారాలు జరపడం దారుణమన్నారు. బంగ్లాదేశ్‌లోని హైందవ సమాజంలో మనోధైర్యం పెంచేందుకు సంఘీభావంగా హిందూ చైతన్య వేదిక ర్యాలీ చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తగిన రక్షణతో పాటు సహాయం అందించాలని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు నాగ శ్రీనివాస్, కాకు మురళీరెడ్డి, జిల్లా కన్వీనర్ పీజీ మహేష్, మధురెడ్డి, సొల్లేటి వెంకటేశ్వర్లు, బయ్యా వాసు, శ్రీనివాస్, బయ్యా రవికుమార్, మోహన్, కిశోర్, మోహన్‌రెడ్డి, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఏబీవీపీ, శివాజీ ఉత్సవ కమిటీ, ఇస్కాన్, హిందూ యువజన, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల ఆవరణలో వైద్య విద్యార్థులు క్యాండిల్స్‌తో సోమవారం రాత్రి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యకళాశాల ప్రిన్సిపల్ వసుంధరాదేవి మాట్లాడుతూ, కలకత్తా నగరంలో ప్రభుత్వ వైద్యురాలిపై హత్యాచారం హేయమైన చర్య అని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సిద్దానాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ కాలేషాబాషా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నెల్లూరు రూరల్ 41వ డివిజన్‌లో రూ.53 లక్షలతో సీసీరోడ్లు, డ్రెయినేజీ, కల్వర్టు పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు చాట్ల నరసింహారావు, నాయకులు నాగేశ్వరరావు, రామకృష్ణ, రామయ్య, లక్ష్మయ్య, సురేష్, వీరాచారి, సురేష్ పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఇంటర్నేషనల్ యూత్‌డే, హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలను పురస్కరించుకుని యువకులు, క్రీడాకారులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి కరెంటాఫీసు సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెట్నల్ సీఈఓ వై.వెంకటయ్య, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, నెహ్రూ యువకేంద్రం యూత్ కో–ఆర్డినేటర్ మహేంధర్‌రెడ్డి పాల్గొని, మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ సౌజన్య, నిర్వాహక అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పశువుల సమగ్ర సమాచారం ఇవ్వండి

నెల్లూరు(దర్గామిట్ట) : పశువులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని మీ ఇళ్లకు వచ్చే విషయ సేకరణదారులకు అందించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ పశు పెంపకందారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పశుసంవర్ధకశాఖ రూపొందించిన 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. పశుగణన కార్యక్రమం సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పశు సమాచారం పూర్తిగా అందించడం ద్వారా అనేక పథకాల రూపకల్పనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ జేడీ కోటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఆర్వో లవన్న పాల్గొన్నారు.

టీకాలతో జబ్బుల నివారణ

నెల్లూరు(అర్బన్) : సకాలంలో టీకాలు వేయించడం ద్వారా టీబీ, డయేరియా, మమ్స్ లాంటి పలు జబ్బులను నివారించవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆత్మకూరు, కావలి, కందుకూరు, నెల్లూరు డివిజన్ల పరిధిలోని వైద్యాధికారులు, సూపర్ వైజర్లకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై సోమవారం శిక్షణ జరిగింది. గర్భిణులు, చిన్నపిల్లలకు వేయాల్సిన టీకాల గురించి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్ వలి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్(డీఐఓ) డాక్టర్ ఉమామహేశ్వరి, డబ్ల్యూహెచ్ఓ సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

ఆశ చూపి.. దోచేసి..

• వృద్ధురాలిపై దాడి, నగదు అపహరణ

నెల్లూరు(క్రైమ్) : తక్కువ ధరకు వస్తువులను ఇచ్చేస్తున్నట్లు ఓ వ్యక్తి ఆమెను నమ్మించాడు. డబ్బులు తీసుకొస్తే వస్తువులను ఇస్తానని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి ఆమెపై దాడి చేసి నగదును దోచుకెళ్లాడు. ఈ ఘటన సోమవారం నగరంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై సోమవారం బీవీ నగర్‌లోని ఓ బిరియాని సెంటర్ ఎదురు సందులోకి వచ్చారు. తాము అమెరికాకు వెళ్తున్నామని తన ఇంట్లోని డబుల్ కాట్ మంచం, టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషీన్ ఇలా గృహోపకరణాలను తక్కువ ధరకే ఇచ్చేస్తామని అక్కడున్న మహిళలతో నమ్మబలికాడు. అతని మాటలు గుడ్డిగా నమ్మిన సుబ్బమ్మ అనే వృద్ధురాలు తనకు కొన్ని వస్తువులు కావాలని చెప్పడంతో రూ.10 వేలు తీసుకుని తన వెంట వస్తే ఇస్తానని చెప్పాడు. దీంతో ఆమె నగదు తీసుకుని అతని బైక్‌లో వెళ్లింది. నిందితుడు అయ్యప్పగుడి సమీపంలోని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి వృద్ధురాలిపై దాడి చేసి నగదు దోచుకెళ్లాడు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులు, స్థానికులకు తెలియజేసి కన్నీటి పర్యంతమైంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద



స్వామి వివేకానందుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట) : స్వామి వివేకానందను యువకులు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వివేకానంద చిత్రపటానికి ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వివేకానందుని ప్రబోధనలు నిత్యనూతనమని, అన్నితరాల వారికి అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ సూర్యతేజ, అడిషనల్ ఎస్పీ సౌజన్య, డీఆర్ఓ లవన్న, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్దుబాటు కౌన్సెలింగ్ బాయ్‌కాట్



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

నెల్లూరు (టౌన్) : ప్రభుత్వ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయనున్న కౌన్సెలింగ్‌ను ఫ్యాప్టో ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు సోమవారం బాయ్‌కాట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ తిరుపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జీఓ నంబర్ 117 ప్రకారం సర్దుబాటు కౌన్సెలింగ్ చేయడం వల్ల పాఠశాలల్లో టీచర్లు లేకుండా పోతారని, తద్వార పాఠశాలల్లో చేరే విద్యార్థులు తగ్గుతారని చెప్పారు. జీఓ 53 ప్రకారం సర్దుబాటు కౌన్సెలింగ్ చేయాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లతో పాటు ల్యాంగేజీ పండిట్లను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిరంజీవితో పాటు ఫ్యాప్టో నాయకులు, యూపీటీఎఫ్, ఏపీటీఎఫ్ (1938), బీటీఏ, ఎస్టీయూ, ఏపీటీఎఫ్(257), డీటీఎఫ్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలిద్దాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ తదితరులు

నెల్లూరు(అర్బన్) : ఎయిడ్స్ వ్యాధితో పాటు లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధులను సమాజం నుంచి నిర్మూలిద్దామని డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య పిలుపునిచ్చారు. ఈ వ్యాధుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించి నివారణకు ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన మీకు తెలుసా అనే ప్రచార కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను వైద్యశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం వైద్య, నర్సింగ్ సిబ్బందితో సమీప ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ, సుఖ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. హెచ్ఐవీ సోకిన వారిపట్ల వివక్షత వీడాలన్నారు. రిస్క్ ఫ్యాక్టర్స్‌గా ఉన్న వారంతా హెచ్ఐవీ, సుఖ వ్యాధుల పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, ఆర్‌బీఎస్కే కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో నెల్లూరీయుల ప్రతిభ



పతకాలు సాధించిన యోగా క్రీడాకారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : 18వ సౌతిండియా యోగా చాంపియన్ షిప్ పోటీల్లో నెల్లూరీయులు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపి ఐదు పతకాలు సాధించారని యోగా మాస్టర్ ప్రసన్నకుమార్ సోమవారం తెలిపారు. తమిళనాడు యోగా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్, కైరలీ యోగా విద్యాపీఠం సంయుక్తంగా తమిళనాడులోని గుమ్మడిపూడిలో నిర్వహించిన పోటీల్లో 56 సంవత్సరాల పురుషుల విభాగం కేటగిరీలో నెల్లూరుకు చెందిన రఘురామయ్య ద్వితీయ స్థానాన్ని, 36–40 సంవత్సరాల పురుషుల విభాగంలో శ్రీనివాసులు మొదటి స్థానాన్ని, 17–25 సంవత్సరాల మహిళా విభాగంలో లీనా, దివ్య మూడో స్థానాన్ని, 13–16 సంవత్సరాల బాలుర కేటగిరీలో సాధన్ ద్వితీయ స్థానాన్ని సాధించారని తెలియజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరు(అర్బన్) : మానవ అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దిశ పోలీస్‌స్టేషన్ సీఐ రామారావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో తల్లీబిడ్డల విభాగం వద్ద యాంటీ–హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల, బాలికలు, మహిళలతో ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే డయల్ 100, లేదా 112కు కాల్ చేయాలన్నారు. అలా చేస్తే తమ టీమ్ రంగంలోకి దిగి ఆపదలో ఉన్న వారిని రక్షించి, కారకులను కఠినంగా శిక్షిస్తామన్నారు. పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై సతీష్, హెడ్‌కానిస్టేబుల్స్ హరి, ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



నియామక ఉత్తర్వులు అందుకున్న వారితో కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : సచివాలయ వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా 11 మంది సోమవారం నియామక పత్రాలను అందుకున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ మేరకు కమిషనర్ సూర్యతేజ నియామక పత్రాలు అందజేశారు. బీకామ్ విద్యార్హత కలిగి వీరంతా గతంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సచివాలయ కార్యదర్శులుగా అర్హత సాధించినప్పటికీ పోస్టింగ్‌లు ఇవ్వలేదు. దీంతో వీరందరూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు సదరు 11 మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను అందజేయాలని ఆదేశించింది. ఈ నియామక ఉత్తర్వులు అందుకున్న వారిలో నెల్లూరు నగరపాలక సంస్థకు ముగ్గురు, గూడూరు మున్సిపాలిటీకి ఐదుగురు, సూళ్లూరుపేట మున్సిపాలిటీకి ఒకరు, వెంకటగిరి మున్సిపాలిటీకి ఇద్దరు ఉన్నారు. కార్యక్రమంలో టీపీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా హర్ ఘర్ తిరంగా

నెల్లూరు(దర్గామిట్ట): ఆగస్ట్ 15ను పురస్కరించుకుని జిల్లాలో హర్ ఘర్ తిరంగా పేరుతో రోజూ ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ఆయన మీడియతో మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందేలా ర్యాలీలు, విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, మానవహారాలు, స్వాతంత్ర సమరయోధుల జీవిత విశేషాలు తెలిపే ఫొటో ఎగ్జిబిషన్లను నిర్వహించామన్నారు. ఆగస్టు 15 కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ సమంజసం కాదు

నెల్లూరు(దర్గామిట్ట) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సమంజసం కాదని మాల మహానాడు నాయకులు అన్నారు. నగరంలోని కలెక్టరేట్ వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో వారు ధర్నా నిర్వహించి, కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని రేబాలవీధి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాలు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీంతో రేబాలవారివీధి, పప్పుల వీధి, స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు, లక్ష్మీపురం, ప్రకాష్‌నగర్, విజయగోపాలపురం, పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు.